



బాలల
జూలై 2016
చంద్రప్రభ
మాసపత్రిక
రూ. 20/-
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్ స్వర్ణసింహాసనం



# నిరపరాధి

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

విష్ణుపురాన్ని పరిపాలించే రామభద్రవర్మ గొప్ప పరిపాలనా దక్షుడు. ప్రజలకి ఎటువంటి సమస్యలు లేకుండా రాజ్యాన్ని తీర్చిదిద్దాడు. అయితే ఇలా రాజుకి మంచిపేరు రావడానికి మంత్రి కృష్ణవర్మా కారణమే! అమోఘమైన తన తెలివి తేటలతో మహారాజుగారికి సమయానుకూలంగా సరైన సలహాలును అందిస్తూ తనవంతు సహాయం చేస్తున్నాడు. దేశానికి రాజు,మంత్రి రెండు చక్రాల్లా సరైన ప్రతిభ కలిగివుంటే రాజ్యం సుభిక్షంగా వుంటుందనటానికి విష్ణుపురం నిదర్శనం.

ఇదిలా వుండగా అనుకోని విధంగా మంత్రి కృష్ణవర్మ మీద ఒక హత్యానేరానికి సహకరించాడన్న ఆరోపణ వచ్చింది. సభలో వాదోప వాదాలు జరిగాయి. కృష్ణవర్మ దోసి అన్న ఆధారాలు ఎక్కడా లభించలేదు. అయితే మంత్రి తెలివితేటలు, అతడి ఉన్నతిపై ఈర్ష్యా, అసూయలుండే రాజకొలువులోని ఉన్నతాధికారులు మహారాజు, మంత్రిని తొలిగించాలని తీవ్ర ఒత్తిడి చేశారు. రాజు చేసేదేం

లేక నిరపరాధి అయినప్పటికి మంత్రిని ఆ స్థాయి నుంచి తొలగించాడు. ఆ తర్వాత మంత్రి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు.

కొంత కాలానికి రాజ్యాన్ని పలు సమస్యలు చుట్టుముట్టాయి. రాజు ఎంత సమర్ధవంతుడైనా, పక్కన కుడిచేయి లాంటి విచక్షణ, విజ్ఞత కలిగిన మంత్రి లేకపోవడంతో సమస్యలు మరింత జటిలం కాసాగాయి. తాత్కాలికంగా కొంతమందిని మంత్రలుగా నియమించుకున్నా వారిలో పరిణితి లేక సమస్యలు సానుకూలమయ్యే సూచనలేం కనిపించలేదు.

ఒకసారి మహారాజు సభలో కొలువుదీరి వుండగా ఒక దూత ప్రవేశించి తను పక్క రాజ్యంకు చెందిన వాడనని, నెల దినాలలో తమ రాజుకు సామంతురాజుగా చేరి కప్పం చెల్లించకపోతే యుద్ధం తప్పదని తమరాజు చెప్పమన్నాడని' తాఖీదునిచ్చి వెళ్ళిపోయాడు.

పులిమీద పుట్రలా మరో జటిలమైన సమస్య ఎదురయ్యే సరికి అందరూ ప్రాన్పడిపోయారు. ఎవరికీ ఏం చేయాలో పాలుపోవడం లేదు.

అంతలో ఒక రాజోద్యోగి, ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి మనను గట్టెక్కించే ఒకే ఒక్క సమర్థుడు కృష్ణవర్మ. ఆయన తెలివి మన మహారాజుగారి భుజబలం కలిసే మన రాజ్యం తిరిగి సుసంపన్నమౌతుంది' అన్నాడు.

"అవున్నిజమే మనమే ఆయన్ని అనుమానించి, అవమానించి రాజ్యం నుంచి వెళ్ళిపోయేలా చేశాం. అనుభవిస్తున్నాం" అన్నారు అందరూ ముక్త కంఠంతో.

అప్పుడు అదే సభలో ఓ సామాన్య పౌరిడిలా కూర్చున్న మంత్రి లేచి, "నేను ఎప్పుడూ ఈ దేశానికి, మహారాజుగారికి విధేయుడినే... అందుకే రోజూ సామాన్యుడిలా సభకు వచ్చి మీ సమస్యలు వింటున్నాను. రాజ్యం అతలాకుతలమవుతున్నందుకు నేనెంతగా తల్లడిల్లిపోతున్నాను మీకు తెలియదు. కానీ

మీ నిర్ణయంలో నన్ను బంధించేశారు. నేనేం చేయలేని పరిస్థితి. కాని ఈరోజు నా అవసరం మీరు గుర్తించారు. నేను నిర్దోషినని మీరు నమ్మితే, మహారాజుగారు మంత్రిగా అవకాశమిస్తే పరిస్థితులు నేను చక్కబరుస్తాను" అన్నాడు.

అందరిఆమోదం తెలియజేస్తూ చప్పట్లు మారుమ్రోగాయి.

అతి తక్కువ కాలంలోనే రాజ్యంలోని సమస్యల్ని పరిష్కరించి రాజ్యాన్ని పటిష్టం చేశాడు. ఎప్పుడైతే రాజ్యంలోని పరిస్థితులు స్థిరపడ్డాయో రాజ్యం బలపడింది. దాంతో యుద్ధానికి కాలు దువ్విన పక్కరాజ్యాలు తోకలు ముడిచాయి.

ఆనాటి విజయ సభలో "చూశారా! మిలోని ఈర్ష్యాద్వేషాలు ఒక అనుభవజ్ఞుని, అపార మేధో సంపత్తి వున్న వ్యక్తిని మంత్రి పదవికి దూరం చేశాయి. దాంతో మనం ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నామో తెలుసుకున్నాం. వ్యక్తి అపరాధి అయితే శిక్షించవచ్చుగాని నిరపరాధి అయితే అవకాశం వచ్చింది కదాని శిక్షార్హుణ్ణి చేస్తే, ఫలితం ఇలాగే వుంటుంది. తన రాజ్యంపట్ల, మహారాజునైన నాపట్ల విధేయత కలిగి తన పదవి యందున్న నిబద్ధతతో రోజూ సామాన్య పౌరిడిలా సభకు వచ్చి మన సమస్యలు వింటూ, ఆకళింపు చేసుకుంటున్నాడు కాబట్టే ఇంత త్వరగా రూపుమాపగలిగాడు. ఇలాంటి మంచి వ్యక్తిత్వం వున్న మంత్రి నేరస్థులకు సహకరించాడంటే నేను నమ్మను. ఉచితరీదిన సన్మానించి మన తప్పును సరిదిద్దుకుందాం ఏమంటారు?" అన్నాడు ఉద్వేగంగా మహారాజు.

అందరూ అమోదయోగ్యంగా చప్పట్లు మారు మోగించారు.

> *ఈ జీవితం క్షణికం, ప్రాపంచిక సుఖాలు, ఆడంబరాలు అశాశ్వతాలు. కానీ పరుల సేవకై జీవితాన్ని సమర్పించినవారే సార్థక జీవులు. మిగిలిన వారంతా జీవన్మృతులు*